# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 08-01-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ దేశంలో 2030 నాటికి 50 లక్షల టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రకటించారు.
- ❖ దేశవ్యాప్తంగా వంద ఆహార పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ తెలిపారు.
- ❖ దేశం ముందున్న లక్ష్యాలు నెరవేరడానికి యువత భాగస్వామ్యం ముఖ్య పాత్ర పోషిస్తుందని కేంద్ర విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్ పేర్కొన్నారు.
- ❖ ఇస్రో నూతన చైర్మన్‌గా వి.నారాయణన్ నియమితులయ్యారు.
- ❖ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నదుల అనుసంధానం కార్యక్రమాన్ని చేపడుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు.

===========================

దేశంలో 2030 నాటికి 50 లక్షల టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్టణంలో ఈ రోజు జరిగిన సభలో ముఖ్య అతిధిగా ప్రధానమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమారు 2 లక్షల కోట్ల రూపాయల విలువ అయిన పలు ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం మాట్లాడుతూ... ఈ ప్రాజెక్టులు రాష్ట్ర వికాసానికి తోడ్పడతాయని వెల్లడించారు. ఐటీ, టెక్నాలజీకి ఆంధ్రప్రదేశ్ ప్రధాన కేంద్రం కానుందని అన్నారు. కాగా, దేశంలో రెండు గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లను ఏర్పాటు చేస్తుంటే అందులో ఒకటి విశాఖపట్టణానికి కేటాయించామని తెలిపారు. దీని ద్వారా ఎంతో మందికి ఉపాధి లభిస్తుందని నరేంద్ర మోడీ పేర్కొంటూ..

(వాయిస్ 30 సెకన్లు)

కాగా అభివృద్ధి ఫలాలు దేశంలోని అన్ని వర్గాలకు చేరాలని ప్రధానమంత్రి ఆకాంక్షించారు. అందరినీ కలుపుకుని ముందుకు సాగడం ద్వారానే అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు.

==========================

దేశం ముందున్న లక్ష్యాలు, ప్రయత్నాలు  వేగవంతం కావడానికి యువత భాగస్వామ్యం ముఖ్య పాత్ర పోషిస్తుందని కేంద్ర విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్ పేర్కొన్నారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, ఒడిశా ప్రభుత్వం సంయుక్తంగా భువనేశ్వర్ లో ఈ రోజు నిర్వహించిన యువజన ప్రవాసీ భారతీయ దివస్ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సాంకేతిక పరిజ్ఞానంతో పాటు  సంప్రదాయాలను మిళితం చేస్తూ.. అభివృద్ధి పథంలో దేశాన్ని ముందుకు నడిపించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆధునిక, ప్రగతిశీల సమాజాన్ని నిర్మించడానికి భారతదేశం దీర్ఘకాలిక సవాళ్లను పరిష్కరించే మార్గంలో ఉందని గుర్తు చేశారు. ప్రపంచంలోని అతిపెద్ద దేశంగా ఉన్న భరత్  ప్రజాస్వామ్య చట్రంలోనే కొనసాగుతూ.... పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతోందని కేంద్ర మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 36 సెకన్లు)

==========================

దేశవ్యాప్తంగా వంద ఆహార పరీక్ష కేంద్రాలు (ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్) లను ఏర్పాటు చేస్తున్నామని కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ తెలిపారు. గ్రేటర్ నోయిడాలో ఇండస్ ఫుడ్ - 2025ను ఈ రోజు ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆహార భద్రత  సామాన్య ప్రజలకు కల్పించాలన్నది కేంద్ర ప్రభుత్వ విధానంగా ఉందని అన్నారు. భౌగోళిక  విస్తీర్ణం పరంగానే కాకుండా జనాభా వైవిధ్యం కారణంగా భారతదేశం తన వంటకాలను ప్రపంచ వ్యాప్తం చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. అదే విధంగా సుగంధ ద్రవ్యాల ఉత్పత్తిలో సైతం రానున్న రోజులలో దేశం ప్రపంచంలో అగ్ర స్థానానికి చేరుకుంటుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు.

==========================

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) నూతన చైర్మన్‌గా వి.నారాయణన్ నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని కేబినెట్ నియామకాల కమిటీ ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపింది. ప్రస్తుత ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ పదవీ కాలం త్వరలో ముగుస్తున్న నేపథ్యంలో ఈ నెల 14న నారాయణన్ బాధ్యతలు స్వీకరించనున్నారని అధికార వర్గాలు తెలిపాయి. ఆయన 2 సంవత్సరాల పాటు ఈ పదవీలో కొనసాగనున్నారు. కాగా నారాయణన్ ఇస్రో చైర్మన్‌గా వ్యవహరించడంతో పాటు స్పేస్ కమిషన్ చైర్మన్‌గాను వ్యవహరిస్తారని అధికార వర్గాలు తెలిపాయి. భారత అంతరిక్ష రంగంలో వి.నారాయణన్‌కు దాదాపు 40 సంవత్సరాల అనుభవం ఉంది. ఇదిలా ఉండగా ఆయన మార్గదర్శకత్వంలో జీఎస్ఎల్‌వి ఎంకె-3లోని కీలక భాగమైన సి-25ను నిపుణుల బృందం విజయవంతంగా అభివృద్ధి చేసింది. 1984లో ఇస్రోలో చేరిన ఆయన వివిధ హోదాల్లో బాధ్యతలను చేపట్టారు.

విరామం

==========================

దేశాన్ని ఏకతాటిపైకి తీసుకురావడంలో నేషనల్ క్యాడెట్ కోర్ (ఎన్.సీ.సీ.) ప్రశంసనీయమైన కృషి చేస్తోందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ఈ రోజు  జరిగిన ఎన్సీసీ రిపబ్లిక్ డే క్యాంప్ - 2025 సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దేశ నిర్మాణం కోసం  శిక్షణ పొందిన యువతను ఎన్సీసీ అందిస్తోందని తెలిపారు. ఎన్సీసీలో చేరి దేశాభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాలని యువతకు కేంద్రమంత్రి పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎయిర్ స్టాఫ్ చీఫ్ అమర్ ప్రీత్ సింగ్

మాట్లాడుతూ... నిస్వార్థ సేవ, నాయకత్వం, దేశభక్తి, క్రమశిక్షణ వంటి నైపుణ్యాలను యువతకు అందించడానికి ఎన్సిసి శిక్షణ ఎంతగానో సహాయపడుతుందన్నారు.

===========================

దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో ఉపకులపతుల నియామకాలకు సంబంధించి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) ముసాయిదా మార్గదర్శకాలు విడుదల చేసింది. దీని ప్రకారం పరిశ్రమకు చెందిన నిపుణులను, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న సీనియర్ ప్రొఫెషనల్స్‌ను నేరుగా ఉప కులపతులుగా నియమించుకునే అవకాశం లభిస్తుంది. ప్రస్తుత మార్గదర్శకాల ప్రకారం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా నియమితులు కావాలంటే ప్రొఫెసర్‌గా లేదా అకడమిక్ పరిపాలనా విభాగంలో కనీసం 10 సంవత్సరాల పాటు పని చేసి ఉండాలి. ఈ నూతన యూజీసీ ముసాయిదా మార్గదర్శకాలను కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈరోజు విడుదల చేశారు.

===========================

మహాకుంభ మేళాకు సంబధించి ఆకాశవాణి, దూరదర్శన్ రూపొందించిన ప్రత్యేక గీతాన్ని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ రోజు ఢిల్లీలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రసారభారతి చైర్మన్ నవనీత్ కుమార్ సెహగల్, ప్రసార భారతి ముఖ్య కార్యనిర్వహణాధికారి గౌరవ్ ద్వివేది, దూరదర్శన్ డైరెక్టర్ జనరల్ కంచన్ ప్రసాద్, ఆకాశవాణి డైరెక్టర్ జనరల్ ప్రజ్ఞా పాలివాల్ గౌర్ తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 13 నుంచి ఫిబ్రవరి 26వ తేదీ వరకు ప్రయాగ్ రాజ్ లో మహాకుంభ మేళా జరగనుంది.

===========================

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నదుల అనుసంధానం కార్యక్రమాన్ని చేపడుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అలాగే పోలవరం ప్రాజెక్ట్ ని తొందరలోనే పూర్తి చేస్తుందని తెలిపారు. విశాఖపట్టణంలో ఈ రోజు జరిగిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సహకారంతో రాష్ట్రం ప్రగతి బాటన నడుస్తుందన్న దృఢ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఐఐటీ, ఐఐఎం, నిట్, ఎయిమ్స్, ట్రైబల్, సెంట్రల్ యూనివర్సిటీ తదితర 12 యూనివర్సిటీలని కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని గుర్తు చేశారు. అదే విధంగా అమరావతి మహా నగర నిర్మాణం కూడా త్వరలో పూర్తి చేస్తామని చంద్రబాబునాయుడు పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

===========================

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రేపు ఒడిషాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన భువనేశ్వర్‌లో 18వ ప్రవాసీ భారతీయ దివస్ సదస్సును ప్రారంభించనున్నారు. ప్రవాసీ భారతీయ దివస్ అనేది భారత ప్రభుత్వం చేపడుతున్న ముఖ్యమైన కార్యక్రమం విదేశీయులు, భారతీయులతో అనుసంధానం కావడానికి ఒకరితో ఒకరు పరస్పరం సంభాషించడానికి ఒక ముఖ్యమైన వేదికగా ఈ కార్యక్రమం నిలుస్తుంది. కాగా, ఒడిశా ప్రభుత్వ భాగస్వామ్యంతో 18వ ప్రవాసీ భారతీయ దివస్ సదస్సు భువనేశ్వర్‌లో నిర్వహిస్తున్నారు. “అభివృద్ధి చెందిన భారతదేశానికి విదేశీ భారతీయుల సహకారం” అన్న ఇతివృత్తంతో ప్రవాసీ భారతీయ దివస్ సదస్సుని ఈసారి నిర్వహిస్తున్నారు.

===========================
===========================